# కథావేదిక

**ప్రతినెలా వైవిధ్యంగల కథలను అందిస్తూ కథాప్రియులకు వెతుక్కునే పనిలేకుండా కథలన్నీ ఒకేచోట చేర్చి, కత్తిరించి పొందుపరచుకుంటే చక్కని కథల సంకలనంలా మారీ, మంచి కథను మళ్లీ మళ్లీ చదువుకునే చక్కని అవకాశాన్ని పాఠకులకు కలిగించే వినూత్న ప్రక్రియ... ఈ కథావేదిక.**

## మంత్రబలం (కథానిక)

- శ్రీకాశ్యప

అప్పలకొండ వయసు నాకులాగానే పదిహేడేండ్లుంటాయి. ఒకనాటి సాయంకాలం సినిమా హాల్లో కలుసుకున్నాం. నా పక్కసీట్లో కూర్చొని నా చెయ్యిపై చెయ్యివేశాడు. చూస్తునుకదా! కంబళి కప్పుకొని ఎలుగుబంటిలా కనుపించాడు. పొట్టిగ, దృఢంగా, ఉంగరాలు చుట్టుకున్న జుట్టుతో, పొడుచుకొని వచ్చిన గట్టి నుదురుతో, నల్లని కనుపాపలతో కనుపిస్తుండే సవరజాతివాడు.

అతని చేష్టలకు అసహ్యించుకున్నా, అతని చేతికున్న ఉంగరం నన్ను ఆకర్షించింది. ఆ ఉంగరం తగరంతో చేయబడి, అందులో ఒక గులాబి రంగు రాయి పొద గబడి ఉంది. తెల్లటి కుందేటికున్న ఎర్రటి కన్నులాగ అది 'పుష్యరాగపురాయి' అని, పుష్యమాసంలో జన్మిం చినవారికి ఆరాయి పీడలను తొలగించి, అష్టైశ్వర్యాలు కలుగజేస్తాయని నా ప్రశ్నకు జవాబుగ చెప్పాడు.

నేను కూడ పుష్యమాసంలోనే పుట్టినానని మా అమ్మమ్మ అంటూ ఉండిన విషయం జ్ఞప్తికి వచ్చింది. ఆ ఉంగరాన్నెలాగైనా సొంతం చేసుకోవాలన్న ఉబలాటం ఎక్కువైంది. దాన్ని ఎంతకిస్తావని అడిగాను.

మొదట్లో అమ్మకానికి నిరాకరించాడు. ఒక కార్టర్ అమెరికన్ సిగరెట్లు తెచ్చియిస్తే అందుకు బదులుగ ఇస్తానన్నాడు. పది సిగరెట్టు పెట్టెల ప్యాకెట్‌ను 'కార్టర్' అంటారు. మా చిన్నాన్నకు అంగడివీధిలో ఒక చిల్లర కొట్టు ఉంది. అక్కడ సిగరెట్లు కూడ అమ్ముతారు. అక్కడ నుండి ఆ కార్టర్ సిగరెట్లు సంపాదించి- అతని కివ్వగనే ఆ ఉంగరాన్ని తీసి నా వేలికి తొడిగాడు. ఒక్కసారిగ ఒళ్ళు జలదరించింది. ఆ క్షణంలో ఏదో శక్తులు నాకు సంక్రమించినట్టు అనుభూతి పొందాను. ఆనాటి నుండి అప్పలకొండ మా యింటి చుట్టుపక్కల తిరుగుతున్నప్పుడు- లేదా మా యింటి ప్రక్కనున్న కాలిదారిన అడవికి వెళ్ళుతున్నప్పుడు కనుపించేవాడు.

అప్పలకొండ వింత మనిషి. అతని జాతిని గురించి, వారికున్న శక్తులను గురించి బడాయి కొట్టేవాడు. అవి వినడానికి భయంకరంగా ఉన్నా, ఒక్కొక్కప్పుడు ఆసక్తికరంగా కూడ ఉండేవి. అతడు చెప్పేవి చాలావరకు అబద్ధాలని తెలుస్తున్నప్పటికి- నమ్మకుండ ఉండలేక పొయ్యేవాణ్ణి. ఒకసారి ఒక వింత విషయం చెప్పాడు.

అమావాష్య ఆదివారం చీకటిపడిన తర్వాత శ్మశానం ప్రక్కన మండే కొయ్యలోని బొగ్గుతో వర్తులాకారంగా గీచి- ఒక మంత్రం పఠిస్తే- అందరికి వట్టిగాలిలా కనుపించే ఆ వర్తులంలో పిశాచాలు మేడిపండులోని పురుగుల్లాగా దట్టంగా కనుపిస్తాయని- మరో మంత్రం చదివితే అందులోని ఒక పిశాచం బయట పడి- నల్లటి కుక్కగా మారి- ఎక్కడికి వెళ్ళితే- అక్కడికి తన వెంట బానిసలా వస్తుందని చెప్పాడు. ఇంతకు ముందొకసారి ఒక పిశాచాన్ని నల్లకుక్కగా





## చిట్కా

''తలకు పేలు పట్టాయి గుండు చేయించుకుంటే అంతా నవ్వుతారు. ఎలా?'' అడిగాడు గోవిందం భార్య లక్ష్మిని.
''ఏముంది. గడ్డం, బాగా పెంచండి. తలలో పేలన్నీ గడ్డంలోకి వస్తాయి అప్పుడు గడ్డం తీయించేయండి.'' అంది లక్ష్మి.

## మైగాడ్

''అమ్మా అమ్మా! మా టీచర్ చాలా స్వార్థపరురాలమ్మా.'' చెప్పింది నిమ్మి
''ఎందుకని?'' ప్రశ్నించింది తల్లి.
''దేవుడంటే అందరివాడు కదా? మరి మా టీచరేమో మాటి మాటికీ 'ఓమైగాడ్ ఓమైగాడ్' అంటుంది.'' చెప్పింది నిమ్మి.

- చందూవంశీ (నంద్యాల)

## సెలక్ట్

''ఏరా రాజా రైల్వేజాబ్ ఇంటర్వ్యూలో సెలక్ట్ అయ్యావుకదా... ఏం ప్రశ్నలు అడిగారేమిటి?''
''నీ ఇంటర్వ్యూ ఉదయం కాదా... సాయంత్రానికెందుకొచ్చావన్నారు.''
''దానికి నివ్వేం చెప్పావ్?''
''రైళ్ళు టైమింగ్స్ ఎప్పుడూ లేటేకదా సర్... నా జాబ్ సీనియారిటీని ఇంటర్వ్యూ నుంచే చూపిద్దామని చెప్పాను. అంతే...''

- దుమ్ము కృష్ణారావు (కాశీనగరం)

మార్చి తన వెంట తిప్పుకుంటుండేవాడని- కాని దాన్నలా అదుపులో ఉంచుకోడానికి ప్రతి సాయంత్రం సూర్యాస్తమయ వేళల్లో ఒక మంత్రం పఠించాల్సి ఉంటుందని- ఒకనాడు పనితొందరలో మరచిపోయినందున- ఆ కుక్కలోని పిశాచం వెళ్ళిపోగా- ఆ కుక్క అక్కడికక్కడే చచ్చి పడిపోయిందని తెలియజేశాడు. ఆ విషయం నాలో చెరగని ముద్ర వేయడమేగాక, అలాంటి కుక్కను నేను కూడ లోబరచుకోవాలని ఆతృత కనపరచి- ఆ మంత్రం ఉపదేశించమన్నాను.

''రవి బాబూ! అది చాలకష్టనిష్టలతో కూడుకున్న పని. కొంతవరకు ఖర్చుతో కూడుకున్న పనిగూడ. పైగా ఉన్నత కుటుంబీకులు నేర్చుకోవలసిన విద్యకాదు.'' అని మొదట్లో ఒప్పుకోలేదు. నేను మరల మరల బతిమాలడంతో, చివరకు మంత్రోపదేశం చేయడానికి ఐదు వందల రూపాయలవుతుందన్నాడు. మా నాన్నగారు నాకిచ్చే పాకెట్ మనీలో ఈ సంవత్సరమంతా మిగులబెట్టింది, అందుకు సరిపోతుందని తెలిసి ఒక్కసారి పొంగిపోయి అంగీకరించాను.

ఒకసాయంకాలం- అప్పుడనుకున్న ప్రకారం- మాయింటి ప్రక్కనుండి వెళ్ళే కాలిబాట దగ్గర మోటారు సైకిలుతో వేచి యున్నాడు అప్పలకొండ. వెనుకసీటుపై నేను కూర్చున్నప్పుడు అతని చేతిలో పొడగాటి కట్ట కనుపించింది. దాన్ని చూపించి అతడే వివరించాడు. అందులో తారులో ముంచిన ఎండుకట్టెలున్నాయని, సమయం వచ్చినపుడు నేను అందులో ఒక కట్టెను వెలిగించి కొంతభాగం బొగ్గైన తర్వాత చీకటిలో తానుద్దేశించిన చోట ''మూలో'' (అనగా చావు) అనే మంత్రాన్ని జపిస్తూ ఆ కట్టెతో ఒక గిరి గీయాలని- ఆదేశించాడు. ఆ తర్వాత చుట్టు గీచిన గీతలో నీలిరంగు మంటలుద్భవిస్తాయని, ఆ మంటల ద్వారా నేను చూసినపుడు పిశాచాలు కనుపిస్తాయని తెలియజేశాడు. ఆ తర్వాత మరో మంత్రం- దాన్నిప్పుడు మరచిపోయాను లెండి- పఠించిన వెంటనే ఒక నల్లటి కుక్క తోకాడించుకుంటూ నా కాళ్ళముందు తిరుగాడుతుందని, ఆ తర్వాత నేనెక్కడికి వెళ్ళితే అక్కడకు వస్తుందని వెల్లడించాడు.

అతడు మాట్లాడేటప్పుడు పిశాచాలను నిర్దేశించగల శక్తిని కనుపరుస్తుండేవాడు. మోటారు సైకిలు మీద కొంతదూరం వెళ్ళాము. పట్టణ శివార్లు దాటగానే అరణ్యమార్గం పట్టించాడు మోటారు సైకిలుని. ఆ దృశ్యం మరువరానిది. దూరంగా కొండలు, కొండలవైపున విశ్రాంతి తీసుకోడానికి వెళ్ళుతున్న సూర్యుడు, నల్లటి కొండల నుండి అమావాస్య చీకట్లు వ్యాపిస్తున్నట్లు, చూసి పరవశించిపోయాను. ఊరగాయల జాడీలోని నూనెలో కదులాడే మామిడి ముక్కల్లా, ఆ చీకట్లో ఏవో బూచులు నాకంటి ముందు తారట్లాడుతున్నట్లు- మంత్రోచ్ఛారణతో ఏదో ఒకటి పిశాచంలా నా ముందు వాలగలదని కలలుగన్నాను.




'ఈ పిశాచాల్లో ఏవైనా మనకు హాని చేసే ప్రమాదం లేదా?'' అన్నాను.

''లేకేం! కాని మనది ప్రసిద్ధమైన మంత్రం కావడం చేత- ఏమన్నా చేయదలచుకున్నా, అవి ఏమి చేయలేవు.'' అని భరోసా యిచ్చాడు అప్పలకొండ.

కొండను చుట్టుకుని పాములాగ పైకి వెళుతున్న రోడ్డుపై కొంతదూరం వెళ్ళగనే రెండు కొండల మధ్య ఒక తిన్నని రోడ్డు తటస్థపడింది. అచ్చటచ్చట చెదురు మదురుగ కొన్ని మోటారు సైకిళ్ళు నిలబెట్టబడి వున్నాయి. చిరుచీకట్లో, దట్టంగా నున్న పొదలవెనుక ఒకరినొకరు కౌగిళ్ళలో బంధించుకుని మా రాక గమనించని కామాతురులు కొందరైతే- మారాకను గమనించి, మేము వారిని దాటి వెళ్ళేవరకు తేరిపార జూస్తున్న శృంగార ప్రియులు మరికొందరు.

ఆరోడ్డు మునిగిపోయింది. పొలాలు వచ్చాయి. ఒక మలుపుదగ్గర మోటారు సైకిలు ఆపి 'ఇదే మన గమ్యస్థానం' అన్నాడు. రోడ్డు ప్రక్కన పాడుబడిన భవనం ఒకటి కనుపించింది.

''బాబూ! ఇది గజపతులకు-శ్రీకృష్ణదేవరాయులకు జరిగిన భీషణ సంగ్రామంలో కూల్చివేయబడిన కోట.'' అన్నాడు.

ఆ పొదల సందులలో ఒక కాలిబాట ఆభవనంవైపు దారి తీస్తుండడం గమనించాను. ఆ శిథిల ప్రదేశంలో ప్రవేశించి మన మంత్రం పఠించాలని చెప్పాడు అప్పలకొండ. కాని పూర్తిగ చీకటి ఆవరించుకోనని కారణం చేత మరికొంతసేపు వేచి వుండాలన్నాడు.

ఆ ప్రాంతాల్లో నర సంచారం బొత్తిగా లేదు. నాకు కొద్దిగా భయంవేసింది. యంత్ర ప్రభావంతో అప్పలకొండ ఏ ఆంబోతుగా మారుతాడో ఎవరికెరుక. పైగా అతని ముఖంలో ఆంబోతు రూపం లీలగా కనుపిస్తూనే ఉంది.

ఇంతలో అడుగుల చప్పుడైంది. మనసుకొంత ఊరట చెందింది. పరికించి చూస్తే ఆ ఆకారం ఒక స్త్రీది. వాళ్ళు మామూలుగా పట్టణానికి పల్లెకు మధ్య ఏకాంతంగా నివసించే సంచార జాతులు. మేము మోటారు సైకిలుపై ఆనుకుని నిలుచున్నాము. రోడ్డు అవతలవైపు నుండి మావైపు వచ్చింది ఆమె. ఆమె ఆకారం మరచిపోలేని విధంగావుంది. నల్లని పావడాపై తెల్లని జాకెట్ వేసుకుంది. వయసులో చిన్నదైనా అందమైనదిగా కనుపించలేదు. పిరమిడ్లలా ఎత్తుగ కట్టిన వంకీ జుట్టు. పొడరు దట్టంగా కొట్టిన భావరహితమైన ముఖం. చిన్న కళ్ళు, పెద్ద నోరుతో ప్రత్యక్షమైంది.

''నమస్తే'' అన్నది. అప్పలకొండ ''మంచిది'' అన్నాడు.

''సిగరెట్టు ఉందా?'' అనింది. అప్పలకొండ

జేబులో నుండి తీసి ఇచ్చాడు. వెలిగించుకుని ఒక దమ్ములాగి-

''మావా ? వస్తావా?'' అని చీకటిలో చేయి చూపించింది.

''ఎందుకు?'' అన్నాడు.

''నీవు నాతో వస్తే మంచికథ చెబుతా.'' అని ఉత్సాహంగా పలికింది. నేను నిరుత్తరుణ్ణయ్యాను.

''మేమెవరుకొన్నావు? నీ కథలు వినడానికి ఇక్కడకు రాలేదు.'' అన్నాడు.

''అయితే రసవత్తరమైన నాకథ వినదలచుకోలేదన్నమాట.'' నిరుత్సాహంగా అని కొద్దిదూరంలో నిలబడింది. ఇంతలో ఒక స్కూటరు దాని ప్రక్కన ఆగింది. తాగుతున్న సిగరెట్టును క్రింద వైచి కాలితో రాచేసింది.

''మనం చాల తొందరగా వచ్చాం. కాస్సేపు అలా తిరిగి వస్తే సరిపోతుంది'' అన్నాడు. మోటారు సైకిలుపై ఇద్దరం వెళ్ళి పావుగంట అలా తిరిగి వచ్చాం. దారిలో అప్పలకొండ మరికొన్ని విశేషాలు వివరించాడు.

ఆ శిథిల భవనంలోకి నేనొక్కడినే వెళ్ళాలని, లేకుంటే ఆ పిశాచాలు బయటకు రావని, అప్పలకొండ ఆపిశాచాలకన్నిటికి తెలుసని, తన ముందుకు రావడానికి అవి జంకుతాయని, అందుకొరకు మరోగట్టి మంత్రం పఠించాల్సి వస్తుందని, అప్పుడు నేనేమీ చూడజాలనని నమ్మబలికాడు. .అలాగే అప్పలకొండ నన్ను వదిలి దూరంగా వెళ్ళి అరగంటలో తిరిగి వచ్చి నన్ను తీసుకుని వెళతానని చెప్పాడు.

''కుక్కను మోటారు సైకిలుపై ఎలా తీసుకెళ్ళడం?'' అని సందేహం వెలిబుచ్చాను. మోటారు సైకిలుపై నెమ్మదిగా వెళ్ళుతూ కుక్కను వెంటబెట్టుకుని వెళ్ళవచ్చని సమాధానపరచాడు.

''ఆ డబ్బు ఐదు వందలలిలాఇవ్వు.'' అని మాటలు ముగించాడు.

నేను ఆ డబ్బులు చెల్లించి, మోటారు సైకిలుపై శిథిల భవనంవైపు వెళ్ళాము.

ఇప్పుడు ఆ ప్రదేశం నిర్మానుష్యంగా ఉంది.

అప్పలకొండ తారులో ముంచిన ఎండు కట్టెను- అగ్గిపెట్టెను నాకిచ్చి పని పూర్తి చేసుకుని రమ్మన్నాడు.

చాలమంది నడచినట్టు తెలియజేసే గడ్డితో నున్న ఆ దారి శిథిల భవనంలోకి దారితీసింది. ముళ్ళకంపలను తొలగించుకుంటు లోనికి వెళ్ళాను. లోపల చిమ్మచీకటికి తోడు కీచురాళ్ళ ధ్వని- ఏదో దుర్వాసన. కొద్దిగా భయం వేసింది. వణికే చేత్తోనే అగ్గిపుల్ల గీచి కట్టెను వెలిగించాను. ఒక్కసారిగా మండుకొంది. ఎర్రటి నాలుకలు చాచుతూ.

''మూలో'' అని అరచాను. ఆ మంటల కాంతి ఆ శిథిల గృహంలోని గోడలపై పాకింది. ఆ గదిలో ఒక మూల యువతి పడివున్నట్లు వెలుగులో గమనించాను. గోడవైపు ముఖం ఉంచి, వీపు నాకు కనపడేలా పడివుంది. ఏదో మంత్రశక్తివల్ల ఒక పిశాచం ఈ యువతి రూపంలో ఉందేమోనని సందేహించాను.

అప్పలకొండ రంగం సిద్ధం పరచాడని సంతోషించాను. ఒక్కో వింత మరోదానిని మించిందిలా ఉంది. దగ్గరకు వెళ్ళి పరిశీలించాను. ఆమె భుజం క్రింద రవికపై నల్లని మచ్చ కనుపించింది. ఆమె ముఖాన్ని పరిశీలించాను. రెండు కళ్ళు రెండు గాజుగోళాల్లా నిస్తేజంగా గోచరిస్తున్నాయి. తన శృంగార కథను మాకు వినిపిస్తానన్న యువతియే. ఆ మచ్చ కత్తివాటే!

అప్పలకొండ ఉపదేశించిన మంత్ర ప్రయోగం ఫలిస్తుందో లేదోగాని మరికొంతసేపు అక్కడ ఉంటే మాత్రం ఆ యువతి హత్యానేరం నాకంటగట్టడం ఖాయం. బుర్ర మొద్దుబారిపోతోంది. కాని కాళ్ళలో చలనం ఏర్పడింది. ఎంతసేపు అలా నిర్మానుష్యమైన ఆ గతుకుల రోడ్డుపై పరుగెత్తానో నాకు తెలియదు గాని, కొద్దిసేపట్లోనే ఆశ్చర్యంగా మెయిన్‌రోడ్డు మీదికి చేరి ఇంటికి వెళ్ళాను.

ఆరాత్రి నేను నిద్రపోలేదు. అసలు ఈ విషయం అప్పలకొండకు తెలియదనేది స్పష్టం. ఆ యువతి హత్యచేయబడింది. ఆ హత్యను పిశాచాలు చేయలేదనేది సుస్పష్టం. కాని అప్పలకొండ నల్లకుక్కను చూపిస్తానని ఈ శవాన్ని చూపించడం మంత్ర ప్రయోగంలో ఒక భాగమా అనేది నా ఆలోచనకతీతంగా ఉండిపోయింది.

బస్సీకి దూరంగా ఒక గ్రామంలో వ్యవసాయం చేసుకుని జీవించే మామయ్య దగ్గరకెళతానని- మా తల్లిదండ్రులకు చెప్పి ఉదయాన్నే రైలెక్కాను.

''ఫలానా పట్టణానికి కొంత దూరంలో, ఫలానా రోడ్డు ప్రక్కనగల శిథిల భవనంలో ఒక వ్యభిచారిణి శవం కనుపించింది. పాత కక్షలవల్ల హత్య జరిగింది.'' అని ఆనాటి వార్తాపత్రికలో చదివాను. పాపం తన శృంగారకథను మరొకరికి వినిపించాలనుకుంటే, ఆ సరసుడేమో ఆమె గుండెల్లో కత్తి దింపి విషాదగాథను సృష్టించాడు.

మా మేనమామగారి ఊర్లో రెండు వారాలుండిపోయాను. ఆ తర్వాత కూడ మా తల్లిదండ్రులవద్దకు వెళ్ళకనే నగరంలో మరోచోట ఉద్యోగంలో చేరాను. నాకు అప్పలకొండను చూడాలన్న కోరిక ఏమాత్రం లేదు. ఐదు వందల రూపాయలు పోగొట్టుకున్నదొక కారణమైతే, ఆనాటి రాత్రి చూసిన దృశ్యం మనోఫలకంపై ముద్ర వేయడం మరో కారణం. చివరకు నా మనోనేత్రం నుండి అప్పలకొండ అదృశ్యమయ్యాడు. కాని అతడిచ్చిన గులాబి రంగు రాయి వున్న తగరపు టుంగరం మాత్రం నా వేలిని విడిచిపెట్టలేదు. ★

## పురుగు పందెం

ఎడ్వర్డ్ క్రెమ్‌లిస్కా ఆయన పేరు. రాజకీయవేత్త. ఆయనగారికి పందాలు కాయడమంటే మహాసరదా. 68 సం.రాల వయస్సుగల ఆ పెద్దాయన ఎలక్షన్లలో తమ పార్టీ ఓడిపోతే, తానొక పెద్ద పురుగును తింటానని పందెం వేశాడు. ఓ పురుగు కర్మకాలి, లిస్కాగారి పార్టీ చిత్తుగా ఓడింది. పందెం ప్రకారం లిస్కా, పత్రికా విలేకరులు, జనం మధ్య నిలబడి, ఓ పెద్ద పురుగును కరకర నమిలి మింగాడు. చూశారా, రాజకీయాల్లో అనేక సుఖాలతోపాటు, ఇటువంటి పురుగుల కార్యక్రమాలు కూడా ఉంటాయి.

## చెవి... కసక్

మక్కాలోని సౌదీ అరేబియాలోగల ఒక ఊళ్లోని హాస్పటల్‌కు ఓ వ్యక్తివెళ్ళి, అచ్చట డ్యాక్టర్‌తో ఏదో తీవ్రమైన వివాదానికి దిగాడు. ఆ సమయంలో అతనికి అంతులేని కోపంతో, డ్యాక్టర్ చెవి కొరికి, వూడొచ్చిన ముక్కను పట్టుకొని ఎటో ఉడాయించాడు. పాపం డ్యాక్టర్‌గారు ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లి తెగిన తన చెవి ముక్కను బాగు చేయించుకొన్నాడు.

## బుల్లి బాలిక!

పాకిస్తాన్‌లో ఓ 12 సం.రాల బాలిక ఉంది. రావల్పిండిలో ఉంటున్న ఆ బాలిక ఎత్తు కేవలం 20 అంగుళాలు మాత్రమే. పేరు రజియా. పుట్టినప్పుడు 7 అంగుళాలు ఎత్తు ఉంది. అరిచేతిలో తేలిగ్గా ఇమిడిపోయేది. ఒక సిగరెట్‌పెట్టె అంత మాత్రమే ఆమె పడుకొనే స్థలం.

\- కొడిమెల

